మలుపులో పరిమళం

కుసుమ మొదటిసారి రామకృష్ణను చూసి పొంగి పోయింది. ఈ సంబంధంగాని కుదిరిందా...అప్పుడూ...అని వూహల్లో తేలిపోయింది. అబ్బాయి లడ్డులా వున్నాడు, వుత్సాహవంతుడుగా కనిపించాడు. ఇక నాన్నగారు 'మా అల్లుడు ఫలానా అని' ఏం నామర్దా అనుకోకుండా, ఠీవిగా నిల్చుని చెప్పి తృప్తిపడతారనుకుందామె.

"హాయిగా...పట్నంలో కాపురం పెట్టాక, అమ్మనూ చెల్లెళ్ళనూ అందర్నీ తీసుకెళ్ళి పట్నం చూపించాలి. అక్కడ మంచిబంగళా ఒకటి అద్దెకు తీసుకోవాలి. అందులో కాపురం పెట్టాలి. ఇప్పుడు ఆయన వున్నది మంచిఇల్లు కాక పోతే, మొదటిరోజే ఆయనకు నచ్చజెప్పి, ముందుగా ఇల్లు మార్పించేయాలి: మంచి పనిమనిషిని కుదుర్చుకోవాలి. ఆయన కుదిర్చిన మనిషి నాకు నచ్చకపోయిందా తన్ని తగ లేసి పొమ్మంటాను. అంతే అవన్నీ చూసుకోవలసింది నేను. అసలు ఇంటి వ్యవహారాలేవీ మగవాళ్ళకు వదలకూడదు. వాళ్లు నానా హంగామా చేస్తారు, ఉట్టినే గొప్పకు పోవడం తప్పించి నాణ్యమూ, పొదుపూ, జాగ్రతా ఏమీ తెలీవు వాళ్ళకి. ఈ మగాళ్ళు ఉట్టినే లెక్చర్లిస్తూ వుంటారుగానీ నిజానికి వీళ్ళ కేమీ తెలీదు. తమకు తెలీదని తమకు లోపల తెలిసినా పైకి చస్తే వప్పుకోరు, ప్రతి భర్తా భార్యదగ్గర తను 'సర్వజ్ఞుడు' 'సర్వసమర్ధుడు' అని ఋజువుచేసుకోడానికి ప్రయత్నిస్తూనే

వుంటాడు. కానీ తనముందే అలాంటి 'తెలివిగలది' వుంటే గమనించడు. ఏంమగాళ్ళో!

ఇంకోటి! ఆయన రేడియో కొన్నారో లేదో!... అక్కడ ఎలెక్ట్రిసిటీ వుందిగా! రేడియో ఎందుకొనకూడదూ? ఏ రెండు వందలో ఇస్తే చక్కా ఓ రేడియో వచ్చేస్తుంది. కావలిస్తే ఎవరన్నా వచ్చినప్పుడు.

'ఇదా ఫలానా రేడియోలెండి' అనేసి, 'మొన్ననే కొన్నాం. నేనే కొనమన్నాను. ఆయన వెంటనే వెళ్ళి కొనుక్కొచ్చేశారు. ఖరీదుకూడా ఎక్కువేమీ కాదు. అంతా ఓ ఐదువందలుఅంతే! తక్కువఖరీదు రేడియోలో పాటలూ అవీ స్పష్టంగా వినపడవని ఆయనే అన్నారు! నేనేమో చెప్పాను- 'ఈ వెధవ రేడియోకోసమని ఇంతడబ్బు దండుగెందుకండీ? ఉన్నది మనమిద్దరమేకదా!' అని కానీ ఆయన విన్లా...' ఇలా దంచేయాలి.

"అమ్మా, చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ, అందరూ అప్పుడు అక్కడికి వచ్చారనుకో! అన్నట్లు ప్రక్కింటి శారదనుకూడా తీసుకుపోవాలి. లేదా రమ్మని రాయాలి. దానికి. తనెందుకూ పనికిరానిదనీ తన్నెవడూ పెళ్ళిచేసుకోడనీ. అంత సాహసం చేయగలిగిన వాళ్ళెవరూ వుండరనీ, ఓ అభిప్రాయముంది. ఉండనీ, ఉండనీలే! ఆఁ—అప్పుడు వాళ్ళందర్నీ వరుసగా రేడియో గదిలో నిశ్శబ్దంగా కూర్చోబెట్టాలి. అందరూ కుర్చీల్లో సోఫాల్లో హాయిగా కూర్చుంటారు. అప్పుడు పేపరు తీసి ప్రోగ్రాం చూడాలి. మొన్న వాళ్ళింటికి వెళ్ళినప్పుడు కంట్రాక్టర్ కృష్ణారావుగారిభార్య చూసిందే అలా చూడాలి

చూసి అచ్చు రేడియోలోలాగే "ఇప్పుడు సిలోన్ అనే నగరంలోని రేడియో స్టేషన్నుంచి తలత్ మహమ్మద్ పాటలు వినిపిస్తాడు. అక్కడ రేడియో స్టేషన్ అని ఒక టుంటుంది, అక్కడ పాడితే మనమిక్కడ వింటామన్న మాట !" అని రేడియో తిప్పేయాలి. ఝుమ్మని పాటలు... తియ్యని పాటలు...నిజానికి ఈ రేడియో గురించీ తనకూ అట్టే తెలీదు. అవన్నీ ఆయన్నడిగి తెలిసి పెట్టుకోవాలి-

"చూశావా నా కూతురు" అని శారదకేసి చూస్తుంది అమ్మ. శారద అఁ...ఔరా" అని తన సోగకళ్ళు క్రిందకి వాల్చేసి వూరుకొంటుంది.

అప్పుడు "పాట బావుందా" అని అడగాలి తను. అది పాపం "బావుంది. చాల బావుందే" అని చచ్చినట్లు వొప్పేసు కుంటుంది. వొప్పుకోకేం జేస్తుంది మరి !......

"ఉఁహూఁ...అప్పుడు అంత దూరం వెళ్ళిందీ కథ. చాల్ చాలు. ఊరుకో...వూరుకో" అని ఊహాగానం కట్టే సింది కుసుమ !

"అయినా ఈ సంబంధం కుదుర్తుందో లేదో ! నాన్న గారు నా మాటక్కాస్త విలువిస్తారుగానీ, ఆయనకు కొంచెం తిక్కవుంది. ఆ తిక్కతో ఏమంటారో ఊహించలేం కదా ! ఆ అబ్బాయి కాస్త చక్కగా ప్రవర్తిస్తే సరి. లేకపోతే 'కాడి కుట్టాడ'నేసి కొట్టిపారేస్తారు. దేవుడా ! ఆ అబ్బాయి కాస్తా ఈ ఒక్కపూట సరిగ్గా నడుచుకొనేలా చేయి. తర్వాత నేను సరిదిద్దుకొంటాను" అని ప్రార్థించింది,

“నేను మీకు కావలిస్తే! పాశుపతాస్త్రం కోసం అర్జునుడు, తన ప్రాణంకోసం మార్కండేయుడు శివుణ్ణి మెప్పించినట్లు, సావిత్రి భర్త ప్రాణాలకోసం యముణ్ణి మెప్పించినట్లు ... ఏదో ‘అట్లు’ ఆయన్ని మెప్పించండి” అన్నట్లు రామకృష్ణకేసి చూసింది. అతను అర్థంచేసుకున్నాడు “సరేలే నాకన్నీ తెలుసులే” అన్నట్లు కళ్ళు త్రిప్పాడు.

* * *

సంతోషంతో కుసుమ చేదుతున్న తాడును బావిలోకి వదిలేసింది. ‘సెటిలయిందే’ అని తమ్ముడు బావిదగ్గరకొచ్చి చెప్పాడు. అతను చెప్పిన క్షణంలోనే ఆమెచేతులు తాడును వదిలేశాయి.

* * *

కుసుమ రేడియో ట్యూన్ చేసింది. రేడియోనుంచి ప్రణయగీత మేదో వినిపిస్తోంది. కుసుమ హృదయమనే రేడియోనుంచి విషాదగీత మేదో వినిపిస్తోంది!

కుసుమ కాపురానికివచ్చి కొద్దిరోజులే అయింది. జీవిత యాత్రలో రస్తా మలుపుతిరిగింది.

ఈ కొద్దిరోజుల్లోనూ భర్త రామకృష్ణ ఆమె కెన్నో చెప్పాడు. ఆయన కబుర్లు చెప్పడంలో మాంచి ప్రవీణుడని ఆయన చెల్లెలు చెప్పింది. కానీ ఆ ప్రావీణ్యమే ఇప్పుడామెకు కష్టం కలిగిస్తోంది. ఆయన చెప్పేమాటలు ఆమెను అయోమయంలోకి తోస్తున్నాయి. ఆమె ఉత్సాహం తగ్గిపోతోంది. ఆయన ఉద్దేశం ఆమెకు బోధపడటంలేదు. అసలు, ఆయన

ఎందుకలా అంటున్నారో ఆమెకు బోధపడటంలేదు. మొదటి రాత్రినుంచీ ఆయనది ఒక్కటే పాట-

"ఇక నువ్వే నా సర్వస్వం: నీ అక్క, చెల్లెలు, తమ్ముళ్ళు, అమ్మా, నాన్నా, పిన్ని...వగైరా నీ బంధువులందరూ, మరి లేరనుకో. వాళ్ళంతా నీ జీవిత పూర్వ రంగంలో తారసపడ్డారు. తర్వాత రంగంలో భర్త ఒక్కడే- నీ సహవాసీ, నీ బంధువున్నూ! ఇక నువ్వు నీ పూర్వరంగంలో వాళ్ళందరినీ మరచిపోవాలి. వాళ్ళను గురించి ఆలోచించడం మానేయాలి. ఇక మనిద్దరం ఒకటి! మన బాగోగులు మనం చూసుకోవాలి. మన శ్రేయస్సుగురించి ఆలోచించాలి-

"పుట్టింటిమీది ధ్యాస మరచిపోవాలి - పుట్టింటిమీది మమకారం ఒక వ్యాధి వంటిది. ఆ వ్యాధి మన జీవితాల్ని నాశనం చేస్తుంది. ధ్యాస అక్కడవుంటే ఇక్కడ నువ్వే సుఖమూ అనుభవించలేవు. ఇన్నాళ్ళు అక్కడ నీ తమ్ముళ్ళు, చెల్లెళ్ళతో ఎంతో కులాసాగా గడిపివుంటావు. కానీ ఇప్పుడు నువ్వు పెద్దదానివయ్యావు. ఇప్పుడు నీ స్వంత ఇల్లు, భర్త..."

ఇలా ఆయన మాట్లాడుతూ వున్నారు. ఆమెకు బోధపడటం లేదు. తన తమ్ముళ్ళు చెల్లెళ్ళను తనెందుకు వదులుకోవాలి. సుభద్ర ఎంతమంచి పిల్ల. తను లేకపోతే ఒక్క క్షణం వుండలేదు. దానికి తన తోడిదే స్వర్గం - ఎన్ని అల్లరి పనులు చేస్తే ఏం? సుభద్ర చలాకీతనం ఎవరికొస్తుంది! సుభద్ర, సుశీ, మాలతీ...రాముడు...సూరీ...వీళ్ళ మధ్య తన బాల్యం ఎంత అద్భుతంగా ఆనందంగా గడచిపోయింది. ఆటలతో పాటలతో, చీకూ చింతా లేకుండా కోపతాపాలు

లేకుండా ఎల్లా గడిచి పోయాయి రోజులు! తను పెళ్ళి చేసుకొన్నంత మాత్రాన తన బాల్యం గతించి పోయిందా! ఇక తనలా ఆనందంతో వుండటానికి, ఆడుకోడానికీ వీల్లేదా! ఇదేనా పెళ్ళంటే? 'అమ్మవారి భక్తుడుమల్లే ఆయన దగ్గర జపంచేస్తూ కూర్చోవలసిందేనా! ఆయన ఇంతమంచి వారు మరి! ఆయన కిదేం బుద్ధో! ఇక తను చెల్లెళ్ళు, తమ్ముళ్ళు, అన్నయ్యల్ని చూడటానికి వీల్లేదా! అసలు వాళ్ళందరూ తనను విడిచి వుండగలరా! ముఖ్యంగా అమ్మ!.

అమ్మ తనని ఎంత ముద్దుగా, శ్రద్ధగా పెంచింది? ఎన్ని విషయాలు నేర్పింది? ఎంతదానిని చేసింది. అలాంటి అమ్మకూ తనకూ ఇంకే సంబంధమూ లేదా! అయ్యో! ఇదేనా పెళ్ళంటే...!?

ఆయనే తన సర్వస్వం కావచ్చు. ఆయన్ను తను ఆరాధ్య దైవంగా పూజించుకోవచ్చు, కానీ ప్రపంచంలో తనింకెవరితోటీ స్నేహంగా వుండకూడదా!

"అమ్మా ఎక్కడున్నావమ్మా!
నాన్నా ఏం చేస్తున్నావ్ నాన్నా!
సూరీ...ఇంకా బువ్వతిన్లా...
మాలతీ ఆడుకోమ్మా!
సుశీ...సూరీ...సుభద్రా...రాముడూ...గోపీ...
మీరంతా ఇంక నాకు శత్రువులు"

ఇంతలో ఆమెకు మరో ఆలోచన తట్టింది. 'పాపం ఆయన ఉద్దేశ్యం అది కాదేమో! తను మాటిమాటికీ పుట్టిం

టికి వెళ్తుందేమోనని ఇలా చెప్పారేమో ఆయన. తనని విడిచి వుండలేదు. అందుకని ఇలా పుట్టింటిని కొంత మరిపించాలని చూస్తున్నారేమో! స్వతంత్రమైన ఆలోచనలతో ఇక తను తానుగా పెరగడానికి వీలు కల్పించాలనుకొన్నారేమో...

రేడియో సంగీతం విసుగు కల్పించింది. టక్ మని రేడియో కట్టేసింది.

పుట్టింటిని తలచుకొనేకొద్దీ ఆమెకు విచారం వేయసాగింది. పుట్టింట్లోని ప్రతి అణువులోనూ తను కలిసిపోయింది. తన ప్రతి అణువులోని చైతన్యమూ పుట్టింటిలో పుట్టినదే! అలాంటి పుట్టింటికీ, తనకూ ఈ కొద్ది రోజుల్లో ఇంత పెద్ద అఖాతం ఏర్పడిపోయిందా!

....

♦ ♦ ♦

రామకృష్ణ ఒక ప్రైవేట్ కంపెనీలో మానేజరుగా పనిచేస్తున్నాడు. ఉద్యోగంలో చేరిన రెండేళ్ళకే అతను చాల మంచిపేరు తెచ్చుకున్నాడు. ఆ కంపెనీకి ఇండియా అంతటా బ్రాంచీలున్నాయి. అందులో ఒక బ్రాంచీకి రామకృష్ణ మేనేజరు; ఇలాంటి కొందరు మేనేజర్లను ఆ కంపెనీ వాళ్ళు విదేశాలకు పంపడానికి నిశ్చయించారు. రామకృష్ణను కూడా పంపించదలచినట్లు రామకృష్ణకు తెలియజేశారు. ఆ శుభవార్త తెలిసిన వెంటనే రామకృష్ణ ఆ విషయాన్ని కుసుమకు చెప్పడానికి సెకిలెక్కి ఆఫీసునుంచి సరాసరి ఇంటికి బయలుదేరాడు.

సైకిలు ఇంటి వరండాలో ఆపి, లోపల ప్రవేశించాడు. అతని కెదురుగా అశ్రువులు చిందిస్తూ "అమ్మా-ఇంక మీ రంతా నన్ను మరచిపోవాలమ్మా!" అని ఇంటి కప్పు కేసి జూస్తూ సన్నగా జీరపోయిన గొంతుతో అంటున్న కుసుమ కనిపించింది. ఆలోచిస్తూ తొందరగా ముందుకు నడిచాడు. అతనికి కొద్దిగా పరిస్థితి అవగాహనైంది.

మెల్లగా దగ్గరజేరి ఆమె భుజంతట్టాడు. ఆమె మేలుకొంది? కళ్ళెత్తిచూసింది.

"ఏమండీ...నన్నింక మాయింటికి వెళ్ళొద్దంటారా? మనింట్లోనే వుండిపొమ్మంటారా" అంది. ఆ గొంతులో కరకరలాడే 'భాష' అతణ్ణి కదిలించివేసింది. "ఇంకా మా యిల్లంటుందేమిటీ- నే నింతచెప్తే ఇదేనా ఫలిత" మను కొన్నాడు. మొదట 'మా' తర్వాత 'మనిల్లు' అనే పదం వాడటంలోని అ అమ్మాయి-సహజ స్వభావంలోని' విశిష్టత అతనికి అర్థమైంది. పుట్టింటిమీది ఆమె సహజమైన అభిమానం, అతనికి ముందే తెలుసు. అయితే అతని ఉద్దేశం వేరు. ఆమె మనస్సును జీవనది నీటిని పంటపొలాల మీదికి మళ్ళించినట్లు తన మీదికి సంపూర్తిగా మళ్ళించుకొవాలను కొన్నాడు. ఆమెకు కొంత స్థిరమైన 'మనస్సు' ఏర్పడ్డ తర్వాత చదువ్వా అదీ చెప్పించాలనుకొన్నాడు. మంచి విజ్ఞానవంతురాలిని చేయాలనుకొన్నాడు.

"ఇప్పుడామెకు ఏది ఎలా చెప్పాలో వెంటనే తోచలేదు. కొన్ని నిముషాలు 'మౌనంగా గడిచాయి. ఆ 'నిముషాలలో' ఎవరూ జోక్యం కలుగజేసుకోలేదు.

"కుసుమా! నన్ను విదేశాలకు పంపిస్తున్నారు, మూడు మాసాలు నిన్ను వదలి వుండాల్సి వుంటుంది; ఎలా వుండగలనో తోచడంలేదు. నెలరోజుల్లో బయలుదేరాలి" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ! ఆమె ఏమీమాట్లాడకుండా విప్పారిన నేత్రాలతో చూసింది. ఆ కళ్ళు నవ్వుతున్నాయి. "మూడు మాసాలు ఎలా వుంటాం కుసుమం" అని ఆమె భుజాలను వూపాడు. తనరెండు చేతులతోటి రామకృష్ణ. ఆమె మరింత కదిలిపోయింది, 'అవును మూడు మాసాలు ఎలా వుండటం? ఇంత త్వరగా, ఇంత కాలం వియోగాన్ని అనుభవించే పరిస్థితి ఏర్పడటమూ! ముఖ్యంగా ఆయన తనని విడిచి ఒక్కరోజు వుండలేరు. తను మాత్రం ఎలా వుండగలుగుతుంది. పెళ్ళయిన తర్వాత, తన స్వంతమంటూ ఒకటి ఏర్పడిన తర్వాత తను చేయవలసిన దేదో ఒక చోటుంటే, పుట్టింట్లో ఎలా వుండగలుగుతుంది? ఇప్పటి పుట్టింటిమీది 'ధ్యాస'కన్న అప్పుడాయన మీది 'ధ్యాస వేయిరెట్లెక్కువయి కలవర పెడుతుంది!

"మీరు నిజంగానే వెళ్ళాలాండీ" అని భర్తను చుట్టుకుంది కుసుమ.

కొన్ని నిముషాలు రామకృష్ణ తనను మరచిపోయాడు.

"నిన్నుకూడా తీసుకెళ్తాను కుసుమం! నీ ఖర్చు మనమే భరించగలిగితే, నిన్ను తీసుకెళ్ళడానికి వొప్పుకుంటారేమో, చూస్తాను" అన్నాడు.

ఆమె ఆక్షణాన జియ్యాని విమానంలో ఎగిరి పోతున్నట్లు, క్రిందుగా అమ్మా నాన్నా పిల్లలూ...శారదా ఇరుగూ, పోరుగూ, చేతులూపుతున్నట్లూ తను ఆయన మీాద మెడవంచి సన్నగా సినిమా పాట ఆలపిస్తున్నట్లూ భావించుకొని వివశురాలై భర్తమీాదికి మెడ వాల్చేసింది కుసుమ !

విజయరా